సాక్షి
నంద్యాల
గురువారం, 4, సెప్టెంబర్, 2025



సత్తా చాటిన వెంకటగిరి వృషభాలు

శ్రీమాతా మారెమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర పోటీల్లో కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామ వృష భాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. 8లో▸



ప్రారంభించరు.. పెళ్లిళ్లు జరగవు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.8.50 కోట్లతో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపాలు నిరుప యోగం మారాయి. వీటిని కూటమి ప్రభుత్వం ప్రారంభించడం లేదు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.64
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 78.604
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 47,200
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 45,179

రెడ్‌బుక్ రాజీకీయం

- ఉద్యోగులపై ఆగని టీడీపీ నేతల దాడులు
- రాజీ పేరుతో దాడి ఘటనను దాచేస్తున్న వైనం
- బెదిరింపులతో ఫిర్యాదు చేయలేని ఉద్యోగ సంఘాలు
- ఉద్యోగులపై దాడిచేస్తే.. తాట తీస్తాం అన్న పవన్‌కల్యాణ్ ఎక్కడ ..?



ఆళ్లగడ్డ: టీడీపీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికారంలో ఉన్నామని తమను ఎవరూ.. ఏమీ చేయలే రనే ధీమాతో ప్రభుత్వ అధికారులపై సైతం దాడులకు తెగబడుతున్నారు. మాట వినని వారిపై దాడులు చేయడం.. మరుసటి రోజు బెదిరించి రాజీ చేసుకోవడం నియోజకవర్గ టీడీపీ నేతలకు పరిపాటిగా మారిపోయింది. ఇటీవల చాగలమర్రిలో డిప్యూటీ ఎంపీడీఓ తాహీర్ హుస్సేన్‌ను టీడీపీ చోట నేతలు మెడపట్టి పట్టుకుని మొహంపై పిడిగుద్దులు గుద్దుతూ దాడి చేయడం, మరుసటి రోజు దాడిచేసిన కార్యాల యంలోనే ఉన్నతాధికారులతో టీ పార్టీ ఇచ్చి రాజీ కుదుర్చిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆ ఘటన మరిచిపోక ముందే మూడు రోజుల క్రితం అడిగినంత యూరియా ఇవ్వలేదనే అక్కసుతో దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామ వీఏఏ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని టీడీపీ చోటా నేతలు వందలాది మంది రైతుల సమక్షంలో కార్యాలయం నుంచి తన్నుకుంటూ బయటకు ఈడ్చుకుంటూ వచ్చారు. ఇది చూసిన రైతులు, సహచర ఉద్యోగులు ఇదేం దౌర్జన్యం అని ముక్కున వేలేసుకున్నారు. అయితే షరా మామూలుగా మరుసటి రోజు ఉన్నతాధికారులైన ఏడీఏ సుధాకర్‌రెడ్డి, ఏఓ ప్రమీల.. టీడీపీ నేతలు నాగలింగేశ్వర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డిని కార్యాలయానికి పిలిపించి రాచ మర్యాదలు చేశారు. అనంతరం ఇక మీదట ఇలా జరక్కుండా చూసుకుంటామని టీడీపీ నేతలు హామీ ఇవ్వడం తో ఇక రాజీ చేశామని, ఉన్నతాధికారులు, ప్రజ ప్రతినిధులకు మెసేజ్ పెట్టడం చర్చనీయాశంగా మారింది. టీడీపీ నేతలు ఏ ఉద్యోగిపైన అయిన దౌర్జన్యం చేయొచ్చు, కోపం వస్తే దాడిచేసి కొట్టవచ్చు.. అని రెడ్ బుక్ రాజ్యాంగంలో ఉం దేమో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధి కార పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు అయితే దాడులు చేస్తారా.. ఒకవేళ దాడిచేసిన కేసు పెట్ట కూడదా అంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.



దొర్నిపాడు మండలం కొండాపురంలో రాజీ చేస్తున్న అధికారులు(ఫైల్)

బయటకు రాని దాడి ఘటనలెన్నో ..

చాగలమర్రిలో డిప్యూటీ ఎంపీడీఓ తహీర్‌హుస్సేన్‌పై న, కొండాపురం వీఏఏ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై జరిగిన దాడులు బహిరంగంగా వందలాది మంది సమక్షంలో జరిగినవి కావుడంతో బయటకు వచ్చాయి. అయితే బయటకు రాని ఇలాంటి బెదిరింపులు, దౌర్జాన్యాలు, దాడులు వందల సంఖ్యలో ఉంటాయనే చర్చ కూడా నియోజకవర్గంలో జరుగుతోంది. కొందరు ఉద్యో గులు, సిబ్బందిపై దాడులు జరిగినా స్థానికంగా ఉద్యోగం చేయాలనే కారణంతో విషయం బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడుతున్నారు. మరికొం దరు రహస్యంగా సెలవు, బదిలీపై వెళ్లిపోతున్నారు.

డిప్యూటీ సీఎం స్పందిస్తే ఒట్టు..


ఉద్యోగులపై దాడి చేస్తే..
తాట తీస్తాం
ఇది వైకాపా రాజ్యం అనుకుంటున్నారా?

ఉద్యోగులపై దాడిచేస్తే తాట తీస్తాం అన్న పవన్ కల్యాణ్

అధికారులపై ఎవరైనా దాడులు చేస్తే తాట తీస్తాం.. తొక్క తీసి కింద కూర్చోపెడుతామని ఊగిపోయిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల శ్రీశైలంలో అటవీశాఖ అధికారులపై టీడీపీ నేతలు వరుసగా దాడులు చేస్తూ బూతులు తిడుతుంటే కనీసం ఉన్నతాధికారులతో విచారణ కూడా చేయించలేదు. టీడీపీకి చెం దిన వారైతే ఏ అధికారిపై అయినా దాడి చేయ వచ్చనే నిబంధనలు రెడ్ బుక్ రాజ్యాంగంలో ఏమైనా ఉన్నాయా అనే విమర్శలు వినిపిస్తు న్నాయి. నియోజకవర్గంలో అధికార పార్టీ నేతకు రూ. లక్షలు దోచిపెట్టేందుకు నిబంధ నలు పక్కన పెట్టి మడుగులొత్తినందుకు ఇప్ప టికే ఇద్దరు ఏఈలు సస్పెండ్ కాగా ఇద్దరు అధి కారులు టీడీపీ నేతలు దాడితో తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. దాడి ఘటనలు బయటకు వచ్చినా పోలీసులు, ఉన్నతాధికారులు సైతం చర్యలకు వెనుకాడుతున్నారు.

న్యూస్‌రీల్

164 యూరియా బస్తాల పట్టివేత

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉం చిన 164 బస్తాల యూరియాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గత నెల 29న గ్రామానికి చెందిన బ్రహ్మానంద రెడ్డి తన ఇంట్లో ఎలాంటి అనుమతులు లేకుం డా అధిక ధరలకు యూరియా విక్రయి స్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింద న్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించగా 164 బస్తాల యూరియాను గుర్తించి సీజ్ చేయ డంతో పాటు కేసు నమోదు చేశామన్నారు. యూరియాను అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తప్పవని, అలాంటి వారి సమాచారాన్ని తమకు అందించాలని ఎస్ఐ కోరారు.

పీఆర్ ఎస్ఈగా వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వేణుగోపాల్

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీ ర్‌గా ఐ.వేణుగోపాల్ బుధవారం బాధ్య తలు స్వీకరించారు. అంతకుముందు ఆయన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను గౌరవపూర్వకంగా కలిశారు. గతంలో ఇక్కడ రెగ్యులర్ ఎస్ఈగా విధులు నిర్వహించిన వి.రామచంద్రారెడ్డి గత ఆగస్టు 31న పదవీ విర మణ చేశారు. ప్రకాశం జిల్లా ఈఈగా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్‌కు ఎస్ఈగా పదోన్నతి కల్పించి కర్నూలుకు పోస్టింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన ఇక్కడ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ శాఖల సమన్వయంతో పిల్లల సంరక్షణ



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు: ప్రభుత్వ శాఖల సమన్వయంతో పిల్లల సంరక్షణ చేయాలని జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి సూచించారు. జిల్లా న్యాయ సేవా సదన్‌లో పిల్లల కోసం స్నేహ పూర్వక న్యాయ సేవల పథ కం–2024పై బుధవారం వర్క్‌షాపు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని పిల్లల సంరక్షణ, రక్షణ బాధ్యత సంబంధిత ప్రభుత్వ శాఖలు తీసుకోవాల న్నారు. ప్రతి బిడ్డకు న్యాయం, గౌరవం దక్కేలా చూడాలన్నారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ మెం బర్, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. దివ్యాంగులైన పిల్ల లను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నట్లు రిసోర్స్ పర్సన్, కర్నూలు డిజేబులిటీ డిపా ర్టుమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ రైస్ ఫాతిమా చెప్పారు. నంద్యాల అడిషనల్ డీఎంహెచ్ఓ శారదాబాయి మాట్లాడుతూ.. అవసరమైన పిల్ల లకు చికిత్సలు, ఉచితంగా మందులు అందిస్తు న్నట్లు చెప్పారు. బడికి వెళ్లని పిల్లలను గుర్తించి స్కూళ్లలో చేర్పిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ విజయ తెలిపారు. సమస్యలు ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కి ఫోన్ చేయవచ్చన్నారు.

ఆధ్యాత్మిక 'పరిమళాలు'

- మల్లన్న పూలతో అగరుబత్తీలు



అగర్‌బత్తీలను కొనుగోలు చేస్తున్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారికి అలంకరించే, ఆర్జిత సేవలకు విని యోగించే పూలను, తులసితో అగరుబత్తీలు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఆ స్ఫూర్తిని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో కొనసాగిస్తున్నారు. శ్రీశైల మహాక్షేత్రంలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు అలంకరించే, ఆర్జితసేవల్లో వినియో గించే పూలను, బిల్వపత్రాలను ఒకప్పుడు వ్యర్థం గా పడేసేవారు. ప్రస్తుతం వీటిని అగర్‌బత్తీలుగా మార్చడంతో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతు న్నాయి. స్వామివారి నిత్యకైంకర్యానికి వినియోగిం చిన పూలు అగర్‌బత్తీలుగా.. గోశాల నుంచి వచ్చే వ్యర్థాలను ఆవుపేడ, గో పంచకం దూప్‌స్టిక్స్‌గా భక్తులను పరవశింపజేస్తున్నాయి.

నేత్రదానంతో అంధత్వ నివారణ

గోస్పాడు: నేత్రదానంతో అంధత్వ నివారణ సాధ్య మవుతుందని జిల్లా అంధత్వ నివారణ సంఘం కం టి వైద్యాధికారి డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గోస్పాడు మండలంలోని యాళ్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సం ఘం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధ వారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ జనా భాలో 15శాతం మంది ప్రజలు అంధత్వంతో బాధ పడుతున్నారన్నారు. మనిషి మరణించిన తర్వాత 4 నుంచి 6 గంటల్లోగా నేత్రదానం చేయవచ్చన్నారు. నేత్రదాయం చేయదలిచిన వారు 1919, 104, 108 వైద్య ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు భారతి, కిరణ్, మూర్తి, క్రిష్ణ కిశోర్ గుప్త, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలకు పదోన్నతి

కర్నూలు(టౌన్): కర్నూలు రేంజ్ పరిధిలో ఇరువురు సీఐలకు పదోన్నతి లభించింది. ఎమ్మిగ నూరు రూరల్ సర్కిల్ సీఐగా పనిచేస్తున్న బీపీ మధుసూదన్ రావు, అలాగే మరో సీఐ బి.వి.శ్రీని వాసులుకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి
- మరో కుమారుడి పరిస్థితి విషమం



విజయుడు, లక్ష్మీప్రసాద్ (ఫైల్)

ప్యాపిలి: బొలేరో వాహనం మృత్యువులా దూసుకొ చ్చింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనా లను ఢీకొట్టడంతో తండ్రి విజయుడు (45), తన యుడు లక్ష్మీప్రసాద్ (25) మృతి చెందారు. మరో కుమారుడు రవి(10) పరిస్థితి విషమంగా మారింది. ఈ దుర్ఘటన ప్యాపిలి మండలం పెద్దపొదిళ్ల సమీపం లో పెద్దమ్మ గుడి వద్ద బుధవారం చోటుచేసుకుంది. చిన్నపొదిళ్ల గ్రామానికి చెందిన విజయుడు, లక్ష్మీదేవి దంపతులతో పాటు వారి కుమారులు లక్ష్మీప్రసాద్, రవి ద్విచక్రవాహనాలపై ప్యాపిలి నుంచి లక్ష్మీదేవి సొంతూరు రంగాపురం వెళ్లేందుకు బయలుదేరారు. పెద్దమ్మ గుడి వద్దకు రాగానే వర్షం కురుస్తుండటంతో రోడ్డు పక్కన ద్విచక్రవాహనాలు ఆపుకుని ఉన్నారు. ఇదే సమయంలో ప్యాపిలి వైపు నుంచి వచ్చిన బొలేరో వాహనం ద్విచక్రవాహనాలపైకి దూసుకువ చ్చింది. ప్రమాదంలో లక్ష్మీప్రసాద్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీ దేవి, లక్ష్మీప్రసాద్, రవిలను చికిత్స నిమిత్తం ఆసుప త్రికి తరలించారు. కర్నూలులో చికిత్స పొందుతున్న విజయుడు కోలుకోలేక మృతి చెందాడు. పదేళ్ల వయస్సు ఉన్న రవి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. విజయుడు వ్యవసాయకూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిం చుకునేవాడు. లక్ష్మీప్రసాద్ ప్యాపిలిలో ఓ దుకాణంలో గుమాస్తాగా పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదో డుగా ఉండేవాడు. ఈ యువకుడి పెళ్లి కాలేదు. తం డ్రీకుమారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తో చిన్నపొదిళ్ల గ్రామంలో విషాదం అలముకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

నలుగురు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు నంద్యాల జిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యా యులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనా ర్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ జిల్లాలోని పాములపాడు మండ లంలోని కొత్త బానకచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం షేక్ మగ్బుల్‌బాషా, నంద్యాల పట్టణం లోని నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యా యుడు పి.వెంకటసుబ్బయ్య, పాణ్యం మండలం బలపనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యా యుడు శేషఫణి, చాగలమర్రి మండలం జిల్లా పరి షత్ బాలికల పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మయ్యలు రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు.

మ్యాథ్స్ ఉపాధ్యాయుడు..



వెంకటసుబ్బయ్య

నంద్యాల టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో పి.వెంకటసు బ్బయ్య 1991 నుంచి 1998 వరకు మ్యాథ్స్ ఉపాధ్యాయు డిగా పని చేశారు. అనంతరం 1998 నుంచి 2016 వరకు నం ద్యాల పట్టణంలోని కేవీఎం మున్సిపల్ హైస్కూ ల్‌లో 18 సంవత్సరాల పాటు విధులు నిర్వహిం చారు. అలాగే టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో 2016 నుంచి 2025 వరకు పని చేశారు. ఈ ఏడాది జూన్ నెలలో నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌కు బదిలీ అయి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన సొంత గ్రామం కోవెలకుం ట్ల మండలం బీజనవేముల కాగా తల్లిదండ్రులు సుబ్బరామయ్య, సిద్దమ్మలు.

తెలుగు పండిట్..



లక్ష్మయ్య

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ (ఓరియంటల్) బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ (స్కూల్ అసిస్టెంట్)గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మయ్య రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు ఎంపికయ్యారు. విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో గురువారం హాజరు కావల్సిందిగా తనకు సమాచారం అందినట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 5వ తేదీన విజయవాడలో అందుకోనున్నట్లు చెప్పారు.

ప్రధానోపాధ్యాయుడు..



షేక్‌మగ్బుల్ బాషా

పాములపాడు: కొత్తబానకచెర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేడ్ 2 ప్రధా నోపాధ్యాయుడిగా విధులు నిర్వ హిస్తున్న షేక్ మగ్బుల్ బాషా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. తాను 1996 డిసెంబర్ 12న ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరానన్నారు. రాష్ట్ర అవార్డు తన బాధ్యతను పెంచిందన్నారు.

రైతు సంక్షేమానికి 'చంద్ర'గ్రహణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

- ఈనెల 9న అన్నదాతలతో ఆందోళనలు, నిరసనలు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో రైతు సంక్షేమానికి 'చం ద్ర'గ్రహణం పట్టిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి విమ ర్శించారు. రైతుల గురించి ఏనాడైనా చంద్రబాబు ప్రభుత్వం ఆలోచించిందా అని ప్రశ్నించారు. కల్లూరు లోని తన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. ఏడాదిన్నర లోపే కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యతిరే కత వచ్చిందన్నారు. రైతులను టీడీపీ అధినేత చం ద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. అన్న దాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు కేంద్రంతో కలుసుకొని రూ. 26 వేలు ఇస్తామని మొదటి సంవ త్సరం ఎగ్గొటారన్నారు. ఇప్పుడు కేవలం రూ. 5 వేలు ఇచ్చారన్నారు. ఇది మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

యూరియా కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోందని కాటసాని అన్నారు. రెండు నెలలైనా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపో వడం దారుణమన్నారు. పండించిన పంటకు గిట్టు బాటు ధర లేక ఉల్లి రైతులు అప్పుల పాలవుతున్నా రన్నారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రైతు లకు ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదన్నారు. తెలుగుదేశం నేతలే ఉద్దేశపూర్వకంగా యూరి యాను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని విమర్శిం చారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పొగాకు, మామిడి, మిర్చి, టమాటా, ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర అందలేదన్నారు. రైతుల గోడు విన కుండా మద్యం, ఇసుక, మైనింగ్‌లలో టీడీపీ నేతలు బీజీగా ఉన్నారన్నారు.

9న ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు రైతులు ఎలాంటి ఇబ్బందులు పడలేదని కాటసాని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందాయన్నారు. ధరల స్థిరీ కరణ పేరుతో జగనన్న రూ. 3 వేల కోట్లు నిధి కేటా యించారని, ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏడాది రైతులను ఆదుకున్నారన్నారు. రైతులను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీసే రోజులు వచ్చాయన్నారు. ఈనెల 9న జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద అన్నదాతలతో కలసి నిరసన తెలపుతామన్నారు. అనంతరం రెవెన్యూ అధికారు లను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో నగర పాలక డిప్యూటీ మేయర్ సిద్దా రెడ్డి రేణుక, కార్పొరేటర్ నారాయణ రెడ్డి, శివారెడ్డి, పాటిల్ హనుమంతరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బార్ల అనుమతులకు రీ నోటిఫికేషన్

- 14వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 15న లక్కీ డిప్

కర్నూలు: జిల్లాలో మొదటి విడత (రౌండ్)లో దరఖాస్తులు రాని ఏడు ఓపెన్ కేటగిరీ బార్లకు ఎక్సైజ్ అధికారులు బుధవారం రీ–నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా పరిధిలో 26 బార్లకు గత నెల 18న మొదటి విడత నోటిఫికేషన్ విడుదల కాగా, 19 బార్లకు స్పందన వచ్చింది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 4, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో 2, గూడూరు నగర పం చాయతీ పరిధిలో 1 బార్‌కు మొదటి విడతలో దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ కమిషనర్ ఆదే శాల మేరకు రీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్ లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.5 లక్షల దరఖాస్తు రుసుముతో పాటు రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు దరఖాస్తులు వచ్చిన బార్లకు మాత్రమే 15వ తేదీ జిల్లాపరిషత్ సమావేశ భవనంలో లక్కీడి ప్(లాటరీ) నిర్వహించి లైసెన్సుదారులను ఎంపిక చేస్తారు. నిబంధనల మేరకు ఆరవ వంతు వార్షిక లైసెన్స్ రుసుము, అదనపు ఆర్ఈటీ మొత్తాన్ని డీడీ రూపంలో చెల్లించిన వారికి వెంటనే వ్యాపారాలు మొదలు పెట్టుకోవడానికి ప్రొవిజన్ లైసెన్స్ జారీ చేయనున్నట్లు ఎక్సైజ్ జిల్లా అధికారి సుధీర్ బాబు తెలిపారు.



అక్రమంగా టిప్పర్‌లో రవాణా అవుతున్న వైట్‌సెల్



ముద్దవరం వద్ద ఐరన్‌ఓర్‌ను వెలికితీసిన దృశ్యం



చంద్రపల్లె వద్ద బలపం రాయిని వెలికితీసే గని

టీడీపీ ఖ'నిజ' దోపిడీ

- బరితెగించిన అధికార పార్టీ నేతలు
- యథేచ్ఛగా ఐరన్‌ఓర్ తరలింపు
- బలపం, సున్నపు రాయికి రెక్కలు!
- వైట్‌సెల్ ఖనిజం రైట్ రైట్

డోన్: ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ఖనిజ సంపదను టీడీపీ నేతలు దోపిడీ చేస్తున్నారు. అటవీ ప్రాంతాలు, రెవెన్యూ భూముల్లో లభించే ఐరన్‌ఓర్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. విలువైన సహజ సం పదను లూటీ చేస్తూ కోటీశ్వరులు అవుతున్నారు. బేతంచెర్ల మండలం పాలిస్ స్లాబ్స్‌కు, డోన్ మండలం వైట్ సెల్‌కు, ప్యాపిలి మండలం సున్నము, బలపము రాయికి ప్రసిద్ధి గాంచింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖనిజాలపై రాయల్టీలను పదిరెట్లు పెంచిం ది. ఖనిజ సంపదను కాపాడేందుకు ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు బరితెగించారు. అక్రమంగా మైనింగ్ వ్యవ హారం చేస్తున్నారు.

ఇవీ అక్రమాలు..

➤ బేతంచెర్ల మండలంలోని పాపిసాని కొట్టాల, ముద్దవరం, తవిసికొండ, గూటుపల్లి, ఉసేనాపురం గ్రామాల పరిధిలోని ఐరన్‌ఓర్ ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో బిలుకు(కాల్షియం రాయి) ఉంది. టీడీపీ నేతలు అక్రమంగా తవ్వుతున్నారు.

➤ ప్యాపిలి మండలం చంద్రపల్లి, హుసేనాపురం ప్రాంతంలో బలపం, సున్నపురాయిని యథేచ్ఛగా తరలిస్తున్నారు.

➤ ప్యాపిలి మండలం బావిపల్లె ప్రాంతంలో వైట్ సెల్‌తో పాటు వివిధ రకాల సుద్ద ఖనిజాన్ని నిత్యం వందలాది టన్నులను ఎగుమతి చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

➤ బలపం, సున్నపురాయి టన్ను ధర రూ.3 వేలు పలుకుతుండటంతో టీడీపీ నేతల యథేచ్ఛగా తరలి స్తున్నారు.



డోన్ మండలం కొచ్చెర్వు గ్రామ సమీపంలో పరదేశి బావి వద్ద జరుగుతున్న అక్రమ తవ్వకం

రింగ్‌గా ఏర్పడి..

లిక్కర్, ఇసుక అక్రమ రవాణాతో పాటు మైనిం గ్ అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకునే విషయంలో టీడీపీ నేతలందరూ రింగుగా ఏర్పడ్డారు. సహజ సంపదను కొల్లగొడుతున్న అధికార పార్టీ నేతల ధనదాహం గురించి డోన్ నియోజకవర్గంలో ప్రజల్లో చర్చించుకుంటు న్నారు. గ్రావెల్(మొరుసు మట్టి), కంకర అక్రమ తవ్వకాల్లో టీడీపీ నేతల ఆరితేరారు.

➤ డోన్ మండలం కొచ్చెర్వు, పరదేశి బావి, పెద్ద మల్కాపురం, కమలాపురం, రామక్రిష్టాపురం గ్రామాలలో డోలమైట్, వైట్‌సెల్, సున్నపురాయిని అక్రమంగా తవ్వి తీస్తున్నా అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు.

➤ 30 టన్నుల బరువు మోసే టిప్పర్లతో ఖనిజాల అక్రమ రవాణా సాగుతున్నా ఏడీఎంఈ చెక్‌పోస్టు అధికారులు ఆపడం లేదు.

➤ అధికార పార్టీ నేతల బెదిరింపులకు భయపడి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సైతం మౌనం వహించారు.

➤ కొచ్చెర్వు గ్రామం నుంచే వైట్‌సెల్‌ను అక్రమం గా ప్రతి నెలా 1800 టన్నులను తరలిస్తూ రూ.1.80లక్షల ఆదాయాన్ని అధికార పార్టీ నేత అక్ర మంగా పొందుతున్నారు.



రోగులు కిక్కిరిసిన ఆలూరు ఆసుపత్రి

వామ్మో.. జ్వరాలు!

- రోగులతో కిక్కిరుస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులు
- నాలుగు రోజుల్లో వెయ్యికి పైగా కేసులు నమోదు

వారం రోజుల నుంచి జ్వర పీడితులు పెరుగుతున్నారు. వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల బాటపడుతున్నారు. గడిచిన నాలుగు రోజుల్లోనే వెయ్యి మందికి పైగా ఓపీ నమోదైనట్లు ఆలూరు సీహెచ్‌సీ వైద్యులు వెల్లడించారు. ఇది కేవలం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగుల సంఖ్య మాత్రమే. ఆయా గ్రామాల్లోని ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన రోగుల సంఖ్య ఎక్కువగా ఉంది. సోమవారం నుంచి బుధవారం వరకు రోజు 450 మందికి పైగా రోగులు ఆసుపత్రికి వచ్చారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఒక్కసారిగా 200 మందికి దాకా రోగులు ఓపీకి వచ్చారు. ఆరుగురు వైద్యుల్లో ముగ్గురు సెలవుపై వెళ్లారు. ఉన్న ముగ్గురులో ఒకరు చిన్నపిల్లల వైద్యులు, ఒకరు జనరల్ మెడిసిన్, ఇంకో వైద్యురాలు గైనకాలజిస్టు మాత్రమే విధుల్లో ఉన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారికి ఆసుపత్రి ఓపీలో కూర్చోవడానికి సరైన సౌకర్యాలు లేక ఉన్న ఇద్దరు డాక్టర్ల వద్ద వైద్యం కోసం వేచి ఉండలేక ఇబ్బంది పడ్డారు.

– ఆలూరు రూరల్

క్లుప్తంగా

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి


సోమశేఖర్ (ఫైల్)

చిప్పగిరి: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం చిప్పగిరిలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వీ సోమశేఖర్ (35) సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి గ్రామం శివారు ప్రాంతానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి మృతి చెందాడు. అదే దారిలో పొలానికి వెళ్లే రైతులు గమనించి కాలనీ వాసులకు తెలిపారు. వారు వెళ్లి చూసే లోపు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య కళ్యాణి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


మృతి చెందిన మహమ్మద్‌బాషా

నందికొట్కూరు: బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఏరియాలో బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు మండలం భూపాల్ నగర్‌కు చెందిన మహమ్మద్‌బాషా(35) బైక్‌పై నందికొట్కూరు వైపు వస్తూ నేషనల్ హైవే నుంచి బ్రాహ్మణకొట్కూరులోకి వచ్చేందుకు అతి వేగంతో సర్వీస్ రోడ్డులోకి దిగాడు. ఆ సమయంలో అదుపు తప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. అటు వైపు వెళ్లే ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న వారు తీవ్రంగా గాయపడిన అతడిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. వైద్యులు పరిశీలించి చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బతుకుబాటలో మృత్యుఒడికి..


రంజిత్‌కుమార్ (ఫైల్)


జూపాడుబంగ్లా: బతుకు దెరువు కోసం పంటకోత మిషన్‌కు హెల్పర్‌గా వెళ్లిన యువకుడు విద్యుదాఘాతానికి బలయ్యాడు. జూపాడుబంగ్లా మండలం తూడిచెర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్(22) తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. అలాగే గ్రామానికి చెందిన మధుకృష్ణ అనే వ్యక్తికి చెందిన పంటకోత మిషన్‌కు హెల్పర్‌గా పని చేస్తున్నాడు. కోత మిషన్ గోస్పాడు మండలం కృష్ణాపురంలో మంగళవారం మినుము పంటను కోసేందుకు వెళ్లింది. అక్కడ పొలంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో మిషన్‌పైన ఉన్న రంజిత్‌కుమార్ విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. వెంటనే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రారంభించరు.. పెళ్లిళ్లు జరగవు

- నిరుపయోగంగా రెండు టీటీడీ కల్యాణ మండపాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 8.50 కోట్లతో నిర్మాణం
- ప్రారంభించేందుకు అడ్డుతగులుతున్న కూటమి ప్రభుత్వం
- పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


దోన్ పట్టణ శివారులో ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్న టీటీడీ కల్యాణ మండపం


గుండాలలో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపం


గుండాల చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణం

డోన్: సన్నాయి రాగాలు.. మేళ తాళాలు.. వేద పండితుల పెళ్లి మంత్రాలు వినిపించాల్సిన ఆ కల్యాణ మండపాల్లో నిశబ్దం అలుముకుంది. వివాహాలతో కళకళలాడాల్సిన ఆ భవనాలు కూటమి నేతల పచ్చపాత పాలనతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డోన్ నియోజకవర్గంలో నిర్మించిన రెండు తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపాలు రెండేళ్లయినా దేవదాయ, ధర్మదాయ శాఖ స్వాధీనం చేసుకోకుండా అధికార పార్టీ నేతలు అడ్డుపడుతున్నారు. దీంతో సుమారు రూ.8.50 కోట్లతో నిర్మించిన మండపాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. నియోజకవర్గ కేంద్రం డోన్‌తో పాటు మండలంలోని ప్రసిద్ధ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రజల సౌకర్యార్థం కల్యాణ మండపాలను నిర్మించింది. వీటిని ప్రారంభిస్తే మంజూరుకు విశేష కృషి చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి మరింత పేరు వస్తుందనే దురుద్దేశంతో కూటమి నేతలు అడ్డు తగులుతున్నారు. టీటీడీ నుంచి ఈ మండపాలను దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోకుండా పచ్చ పార్టీ నేతలు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో కూడా ఇలాగే ఓ సంఘటన చోటు చేసుకుంది. గత టీడీపీ పాలనలో 2014–19 మధ్యలో నియోజకవర్గానికి టీటీడీ కల్యాణ మండపాలు మంజూరైనా అప్పటి దేవదాయ శాఖ మంత్రి కేఈ కృష్ణ అడ్డుకున్నారు. ఆ సమయంలో డోన్ నుంచి బుగ్గన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండటం కారణమని అప్పట్లో చర్చ జరిగింది. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో ఉరకలు వేసింది. ఊరూరా రహదారులు, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపడం, ప్రభుత్వ విద్యా సంస్థలు మంజూరు కావడం జరిగింది. ఈ క్రమంలోనే డోన్, ఎస్. గుండాలలో కల్యాణ మండపాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గుండాల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో రూ.3 కోట్లతో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి టీటీడీ పాలక మండలి అధ్యక్షులు వైవీ సుబ్బారెడ్డితో కలిసి కల్యాణ మండప నిర్మాణం ప్రారంభించారు. అలాగే డోన్ శివారులో కర్నూలుకు వెళ్లే 44వ జాతీయ రహదారి పక్కన రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపం కూడా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు.

ఆధునిక వసతులతో నిర్మాణం

రెండు కల్యాణ మండపాలలో సుమారు వెయ్యి మంది కూర్చునేందుకు సువిశాలమైన హాలుతో పాటు పెళ్లికూతురు, పెళ్లికుమారుడికి విడిది గదులు, 10 నుంచి 20 మందికి సరిపడే సూట్లు, ఆధునిక వసతులతో కిచెన్, టాయ్‌లెట్స్, ముందు భాగం సువిశాలమైన పార్కింగ్ స్థలం, గార్డెనింగ్ ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఈ కల్యాణ మండపాలను టీటీడీ అధికారులు అప్పగించేందుకు ముందుకు వస్తున్నా దేవదాయ శాఖ రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి స్వాధీనం చేసుకునేందుకు వెనకడుగు వేస్తోంది.

రాజకీయ వివక్ష తగదు



కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక వసతులతో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపాలు నిరుపయోగంగా ఉండటం దురదృష్టకరం. పేద, మధ్య తరగతి ప్రజలకు కల్యాణ మండపాలను అందుబాటులోకి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేయడం కూటమి నేతల రాజకీయ వివక్షతకు నిదర్శనం. – మల్యాల భాస్కర్ రెడ్డి, రైతు, మల్యాల గ్రామం, డోన్ మండలం

పేదలకు భారం తగ్గుతుంది



పేద ప్రజలు తమ పిల్లల వివాహాలను ప్రైవేటు ఫంక్షన్ హాళ్లలో నిర్వహించాలంటే ప్రస్తుతం ఖర్చు కూడన్నది. కొందరు సీజన్ అంటూ అధిక ధరలు వసూలు చేస్తున్నారు. టీటీడీ కల్యాణ మండపాలను వెంటనే వినియోగంలోకి తేవాలి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం తగ్గుతుంది.
– నరసింహారెడ్డి, యాపదిన్నె గ్రామం, డోన్ మండలం

అందుబాటులోకి తేవాలి



టీటీడీ చేపట్టే ధార్మిక కార్యక్రమాలలో భాగంగా గుండాలలో రూ.5 కోట్లతోనూ, పట్టణంలో రూ.3.5 కోట్లతో కల్యాణ మండపాలను నిర్మించింది. రాజకీయ విబేధాలు పక్కకు పెట్టి వీలైనంత త్వరగా వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాలి. – పోస్టు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు

తొగలగల్లులో వ్యక్తి దారుణహత్య


హత్యకు గురైన అహోబిలం

ఆస్పరి: తొగలగల్లు గ్రామానికి చెందిన అహోబిలం (33) అనే వ్యక్తి బుధవారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. గ్రామస్తులు, ఆస్పరి సీఐ గంగాధర్ చెప్పిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన అహోబిలం అనే వ్యక్తి పక్కనే ఉన్న కలపరి గ్రామంలో వివాహం చేసుకున్నాడు. ఆ గ్రామంలో మాల పున్నమి పండగ ఉండడంతో బుధవారం ఉదయం భార్య పిల్లలతో కలిసి వెళ్లాడు. అక్కడే భార్యను విడిచి రాత్రి స్వగ్రామానికి కాలినడకన తిరిగి ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో తొగలగల్లు – దొడగొండ గ్రామాల మధ్య గుర్తు తెలియని దుండగులు అహోబిలం గొంతు కోసి హత్య చేశారు. రోడ్డు పక్కన ఉన్న మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించడంతో హత్య వెలుగులోకి వచ్చింది. సంఘటనా స్థలానికి తొగలగల్లు గ్రామస్తులు తరలి వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు హత్య జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడుకి భార్య గంగమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


బోయ వీరేంద్ర (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సోమప్పనగర్ సమీపంలోని లక్ష్మీనరసింహ కాలనీలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కాగా తమ కుమారుడిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని యువకుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన బోయ రాజు, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో రెండవ కుమారుడు వీరేంద్ర (19) ఆటో నడుపుతున్నాడు. ఎల్ల బీడు ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయిని గత కొన్ని నెలలుగా ప్రేమిస్తున్నాడు. ఇదే విషయంపై చాలా సార్లు అమ్మాయి, అబ్బాయి కుటుంబాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వీరేంద్ర తల్లిదండ్రులు తిరుమలకు వెళ్లారు. అయితే ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న వీరేంద్రకు మంగళవారం రాత్రి అమ్మాయి తరుపు వారు ఫోన్ చేసి బయటకు రమ్మని చెప్పి తీసుకెళ్లారని, దాడి చేసి చంపేసి, ఆ తర్వాత తమ ఇంటి సమీపంలో ఉన్న షెడ్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారని యువకుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఎల్ల బీడు ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారే తన కుమారుడిని చంపేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద యువతితో మాట్లాడిన వాయిస్ రికార్డ్స్ ఉన్నాయని చెబుతున్నారు. యువకుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి విలేకరులకు తెలిపారు.

సత్తా చాటిన వెంకటగిరి వృషభాలు



బండలాగుతున్న వృషభాలు, వృషభాల యజమానులకు నగదు బహుమతి అందజేస్తున్న దాతలు

కృష్ణగిరి: పుట్లూరు గ్రామంలో శ్రీ మాతా మారెమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అంతర్ రాష్ట్ర స్థాయి పాల పళ్ల ఎద్దుల బండలాగుడు పోటీల్లో కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామ శ్రేషాంక్ శ్రేయ వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. రెండవ స్థానంలో నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మేకల బానుఖా, వెంకటగిరి శ్రేషాంక్ శ్రేయలకు చెందిన వృషభాలు ఉమ్మడిగా నిలిచాయి. మూడవ స్థానంలో ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లెకు చెందిన ఉప్పరి లక్ష్మీదేవి, సంజామల మండలం ముక్కమల్ల గ్రామానికి చెందిన ముసాని చంద్రశేఖర్‌రెడ్డి వృషభాలు ఉమ్మడిగా నిలిచాయి. నాల్గవ స్థానంలో తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడుకు చెందిన వడ్డేమాను అంజనేయరెడ్డి వృషభాలు, ఐదవస్థానంలో సీ. బెళగల్ మండలం యనకండ్లకు భద్ర విజయభాస్కర్ వృషభాలు గెలుపొందినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలి పారు. ఈ పోటీల్లో 11 జతల ఎద్దులు పాల్గొనట్లు తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతలు సహకారంతో వరుసగా రూ. 25 వేలు, రూ. 20వేలు, రూ. 15 వేలు, రూ. 12వేలు, రూ.10వేలు అందజేశారు.

నేడు న్యూ కేటగిరీ విభాగంలో..

బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం న్యూ కేటగిరి విభాగంలో అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వాటికి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలను దాతల సహకారంతో అందిస్తున్నట్లు వారు తెలిపారు.

అడవి పందుల దాడితో మొక్కజొన్న పంట ధ్వంసం


ధ్వంసమైన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

ఆత్మకూరు: నల్లకాల్వ గ్రామంలో కాటేపోగు నాగయ్య, పులిగుజ్జు ప్రకాశంకు చెందిన మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. దాదాపు ఆరు ఎకరాల్లో పంట నష్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటను అడవి పందులు నాశనం చేశాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. అడవి పందుల నుంచి పంటను రక్షించేందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రూపాయి ఖర్చు లేకుండా కేసులు పరిష్కారం

కర్నూలు(సెంట్రల్): ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏమైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి రూపాయి ఖర్చు లేకుండా పరిష్కరించుకోవాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, సభ్యులు డి.రాజుబాబు, టి.శివశంకర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. డోన్‌కు చెందిన ఆర్. ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డును వినియోగిస్తూ సేవా లోపానికి గురి కావడంతో శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. బాధితుడు తన క్రెడిట్ కార్డు ఈఎంఐకు సంబంధించి తగిన బ్యాలెన్స్‌ను బ్యాంకులో ఉంచినప్పటికీ కొంత మొత్తాన్నే కట్ చేసుకొని మిగతా మొత్తానికి వడ్డీ వేయడంతో పలుమార్లు ఫిర్యాదు చేశాడు. అయినా బ్యాంకు అధికారులు స్పందించకపోవడంతో ఆ క్రెడిట్ కార్డునే రద్దు చేసుకున్నాడు. అయినా బ్యాంకు క్రెడిట్ కార్డు రద్దుకు అదనంగా రూ. 5,349.28 జరిమానా విధించింది. ఈ క్రమంలో బాధితుడు లోక్ అదాలత్‌ను ఆశ్రయించడంతో ఇరువర్గీయుల మధ్య రాజీ కుదిర్చి మొత్తం రూ.6 వేలు చెల్లించేలా తీర్మానం చేసి సమస్యను త్వరగా పరిష్కరించినట్లు వారు తెలిపారు. ప్రజలు తమ వినియోగ సేవలకు సంబంధించిన సమస్యలకు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే త్వరగా కేసుల పరిష్కారంతోపాటు రూపాయి ఖర్చు ఉండదని వివరించారు.

తపాలా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్‌గా కర్నూలు డివిజన్‌లో పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ జి.జనార్దన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు పాతబస్టాండ్ సమీపంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఎంపికైన డైరెక్ట్ ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.5 వేలను ఎన్‌ఎస్‌సీ రూపంలో (వాపసు ఇవ్వబడును) చెల్లించాలన్నారు. డైరెక్ట్ ఏజెంట్‌లు చేయించే పాలసీలకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కమీషన్ చెల్లిస్తామన్నారు. వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.హరి కృష్ణా రెడ్డి 7013029312ను సంప్రదించాలన్నారు.

మాన్యం భూమిలో అక్రమ మైనింగ్

- యథేచ్ఛగా కూటమి నేతల తవ్వకాలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం


మాన్యం భూమిలో మైనింగ్ జరుగుతున్న దృశ్యం


పలుకూరు రామేశ్వరస్వామి ఆలయం

బనగానపల్లె: కూటమి ప్రభుత్వంలో పేదలు, ప్రభుత్వ భూములకే కాదు.. దేవుడి భూములకూ రక్షణ లేదు. కూటమి నేతలు దర్జాగా ఆక్రమించి యథేచ్ఛగా మైనింగ్ చేస్తున్నా అడిగేనాథుడు లేరు. మాన్యం భూమిలో అక్రమ మైనింగ్ అడ్డుకోవాలని వినతులు ఇస్తున్నా బుట్టదాఖలవుతున్నాయి. నాపరాయి మైనింగ్‌కు జిల్లాలోనే పలుకూరు ప్రసిద్ధి. గ్రామం చుట్టు పక్కల వేలాది ఎకరాల్లో నాపరాయి మైనింగ్ కొన్నేళ్లుగా జరుగుతోంది. ఈ క్రమంలో కూటమి నేతలు గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమిని ఆక్రమించి యథేచ్ఛగా మైనింగ్ చేస్తున్నారు. రామేశ్వర స్వామి ఆలయానికి సర్వే నంబరు 308లో నాలుగు ఎకరాల భూమి ఉంది. ఇందులో మైనింగ్ నిక్షేపాలు పుష్కలంగా ఉండటంతో అధికారపార్టీ నాయకుల కన్ను ఈ భూమిపై పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ భూమి ఆక్రమణకు గురైంది. ఎటువంటి అనుమతులు లేకుండానే ఆక్రమణదారులు నాపరాతి మైనింగ్ పనులు చేపడుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం చదరం నాపరాయి విలువ సుమారు రూ.600 ఉంది. ఈ క్రమంలో రోజుకు 40–50 చదరాల నాపరాయి ఆలయ మాన్యం భూమిలో ఉత్పత్తి అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా నెలకు సుమారు రూ.10 లక్షల వరకు నాపరాయి విక్రయం ద్వారా ఆక్రమణదారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఆలయ మాన్యం భూమిలో అక్రమ మైనింగ్‌పై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆలయ ప్రధాన అర్చకులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

రక్షణ ఒట్టి మాటలేనా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేవదాయ శాఖ భూములకు రక్షణ కల్పించే బాధ్యత తీసుకుంటుందని, ఆలయ భూములు భగవంతుడి భూములుగా భావించాలని, దేవదాయశాఖ భూముల జోలికి వెళ్తే సహించేది లేదని, ఆక్రమణ భూములు వెనక్కి తీసుకుంటామని ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభల్లో భారీ ఉపన్యాసాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలు ఆక్రమణలకు పాల్పడుతున్నా అడిగేవారు లేరు. పలుకూరులో అక్రమ మైనింగ్ విషయం దేవదాయ, మైనింగ్ శాఖ అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దేవుడి భూమికే రక్షణ లేకపోతే ఎలా అంటూ గ్రామస్తులు విమర్శిస్తున్నారు.